
కోహెడలో 'ధరణి' ఉద్యోగుల మాయాజాలం 7లో
● రైతు ప్రమేయం లేకుండానే వేరొకరికి పట్టా!

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 సిద్దిపేట
బుధవారం 3 జూలై 2024

పెట్టుబడిసాయం ఎవరికిద్దాం!

- అన్నదాతలు మీరేమంటారు?
- 'రైతు భరోసా' అమలుపై అభిప్రాయాలను సేకరిస్తున్న ప్రభుత్వం
- సాగులో ఉన్న భూమికే పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతుల మొగ్గు

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలుకు చర్యలు చేపట్టింది. గతంలో మాదిరిగా కాకుండా కేవలం వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రమే పంటసాయం అందించాలని భావిస్తున్న ప్రభుత్వం అందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎకరాకు పంటసాయం రూ.10వేల చొప్పున ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని రూ.15వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు స్థానంలో రైతుభరోసా అమలు చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. అయితే, వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే రైతుభరోసా అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం ఎలా ఉండాలి? ఎవరికి ప్రయోజనం కలగాలి? ఏమైనా పరిమితి పెట్టాలా? ఆదాయపన్ను కట్టే వారి విషయంలో ఏం చేయాలి? కౌలు రైతుల విషయంలో ఏం చేయాలి? అనేదానిపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలను సేకరిస్తోంది. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికల్లో పాల్గొన్న రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కూడా రైతుభరోసా పథకంపై క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటుంది. అందులో భాగంగా ప్రాథమిక సహకార సంఘాల సమావేశాలను జూన్ 29నుంచి ఈనెల 4 వరకు నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయశాఖ, ప్రాథమిక సహకార సంఘాలు కలిసి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సలహా సూచనలను స్వీకరిస్తున్నారు.

సాగులో ఉన్న భూమికే...

ఇప్పటి వరకు నిర్వహించిన రైతు సమావేశాల్లో అనేక మంది సాగులో ఉన్న భూమికి పెట్టుబడి సాయం అందించాలని కోరుతున్నారు. ఇళ్లకు, రోడ్లకు రియల్ఎస్టేట్ వెంచర్లు, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే భూములకు సాయం ఇవ్వకూడదని సూచించారు. రైతుభరోసాకు వ్యవసాయ పరిమితిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు 5 ఎకరాల వరకే పరిమితి ఉండాలని మద్దతు తెలిపారు. పదెకరాల వరకు మాత్రమే సాయం అందించాలని మరికొంతమంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగుచేసే భూములన్నింటికీ సాయం అందించాలని ఇంకొందరు రైతులు తెలిపారు. ఎక్కువ శాతం మంది రైతులు మాత్రం సాగులో ఉన్న భూమికే పెట్టుబడి సహాయాన్ని అందించాలని తెలిపినట్లు సమాచారం. ఇదే విషయమై జిల్లా సహకారశాఖ అధికారి కరుణను 'ఆంధ్రజ్యోతి' వివరణ అడగగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుభరోసా పథకంపై ప్రాథమిక సహకార సంఘాలలో రైతుల అభిప్రాయాన్ని స్వీకరిస్తున్నామని తెలిపారు. రైతుల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని స్పష్టం చేశారు.



కొండపాకలో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

శత్రువుల నుంచి నన్ను బతికించండి.. మీరు బతకండి..!

కార్యకర్తలతో సమావేశంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 2: 'శత్రువుల నుంచి నన్ను బతికించండి.. మీరు బతకండి..' అని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కార్యకర్తలను కోరారు. ఇందుకోసం కార్యకర్తలెప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సంగారెడ్డి డివిజన్ ఆత్మ కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. సంగారెడ్డి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్త అర్జున్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అన్నా నువ్వంటే నాకిష్టం.. నీ కోసం ప్రాణమైనా ఇస్తాను అని అంటావు.. కానీ నేను అరగంట క్రితం చెప్పిన పని ఇంకా చేయలేదు. నాకు నీ ప్రాణం ఎందుకు, నాకు బతుకు కావాలి, మీరు బతకండి, నన్ను బతికించండి' అని వ్యాఖ్యానించారు. దీంతో కార్యకర్తలు సరదాగా నవ్వుకున్నారు.



సంగారెడ్డిలో కాంగ్రెస్ కార్యకర్త అర్జున్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నామినేటెడ్ ఆశలు

- పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి
- 'సుడా' చైర్మన్ పదవి కోసం పోటాపోటీ
- పదవుల కోసం అధిష్ఠానం చుట్టూ తిరుగుతున్న నాయకులు
- మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ అధ్యక్షుడి ఎన్నిక తరువాతే



సిద్దిపేట టౌన్, జూలై 2 : పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఎన్నికల కోడ్ ముగిసింది. ఇక నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న సిద్దిపేట జిల్లాలోని పలువురు నాయకులు తమకు అవకాశం ఇవ్వాలంటూ నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, కొమురవెల్లి, హుస్నాబాద్‌కు చెందిన ఆశావహులంతా నామినేటెడ్ పోస్టుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పలు నామినేటెడ్ పదవుల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. సిద్దిపేటఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పదవితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ, కొమురవెల్లి ఆలయం, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలతో పాటు, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లాలోని పలు ఆలయ కమిటీ చైర్మన్ పదవులున్నాయి. వీటిలో పలు చైర్మన్ పదవులకు మహిళా రిజర్వేషన్లు కూడా ఉన్నాయి. ఇంతకాలం కష్టనష్టాలను ఓర్చుకుంటూ పార్టీనే నమ్ముకున్న వారు నామినేటెడ్ పదవులు తమనే వరిస్తాయని గంపెడాశలతో ఉన్నారు. ఇన్‌చార్జి మంత్రులతో పాటు తమకు అనుకూలంగా ఉన్న రాష్ట్రస్థాయి నాయకులు, మంత్రుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తున్నారు. 'సుడా' చైర్మన్ పదవితో పాటు జిల్లాలోని పలు నామినేటెడ్ పదవుల కోసం నాయకులు పోటీపడుతున్నారు.

'సుడా' చైర్మన్ కోసం ముగ్గురి మధ్యే తీవ్ర పోటీ

సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులందరూ తిరిగి సిద్దిపేటఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు మాత్రం నలుగురు, ఐదుగురు మినహా ఎవరు కూడా పదవిని ఆశించడం లేదు. సిద్దిపేటతో పాటు 26 గ్రామాల వరకు విస్తరించిన సుడాకు చైర్మన్ పదవి వస్తే ప్రొటోకాల్‌తో పాటుగా హుందాతనంగా ఉండొచ్చని నేతలు భావిస్తున్నారు. సుడా పరిధిలో రియల్ఎస్టేట్‌కు సంబంధించి ఏ వెంచర్ చేయాలన్న, విల్లాలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలకు 'సుడా' అనుమతులు తప్పనిసరి. దీంతో పదుల సంఖ్యలో పోటీ పడుతున్నా ముగ్గురి మధ్య తీవ్ర పోటీ ఉండనున్నది. అందులో సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నా పార్టీని వీడకుండా, పార్టీ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తున్న ఇద్దరు నాయకులతో పాటు, ఇతర పార్టీ నుంచి వచ్చి కొంతకాలంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుడిలో ఒకరికి సుడా చైర్మన్ పదవిని అధిష్ఠానం కట్టబెట్టనున్నట్లు సమాచారం.

ఎవరికి వారే ధీమా

సిద్దిపేట జిల్లాలో ఏర్పడిన పలు పదవులు తమకే దక్కుతాయని నాయకులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేటకు సుడా చైర్మన్ వరించనుండగా, హుస్నాబాద్‌కు జిల్లా గ్రంథాలయ చైర్మన్, దుబ్బాకకు రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్ష పదవి, చేర్యాల, కొమురవెల్లి ఆలయ చైర్మన్ పదవులు దక్కనున్నాయి. కాగా గజ్వేల్‌కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి పదవి ఇప్పటికే కొనసాగుతున్నది. దీంతో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు నామినేటెడ్ పదవులు లభిస్తుండటంతో, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు ధీమాతో ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి ఎన్నిక తర్వాతే..

నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారికి, అధిష్ఠానం అండతో త్వరలోనే పదవులు దక్కనున్నాయి. అందుకు మరో వారం, పది రోజుల పాటు వేచి చూడక తప్పడం లేదు. దానికి గానూ ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో పాటు, మొదటి వారంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న తరువాతే నామినేటెడ్ పదవులపై కొలిక్కి రానున్నది. అందుకుగానూ సమయం దగ్గరపడుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆయనతో సన్నిహితంగా ఉంటున్న మం త్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అనుచరుల వద్దకు పలువురు ఆశావాహులు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో ఎవరెవరికీ పదవులు దక్కుతాయో తెలియాలంటే కొన్నిరోజులు వేచిచూడాల్సిందే.

అటవీ, రెవెన్యూ జాయింట్ సర్వే పూర్తిచేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 2: అటవీ హద్దులను నిర్ధారించేందుకు, ఆక్రమణలను తొలగించేందుకు ఫారెస్ట్, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 23738 హెక్టార్ల అటవీ విస్తీర్ణం 77 ప్రాంతాల్లో ఉందన్నారు. అటవీ హద్దులను నిర్ధారించడానికి, ఆక్రమణ తొలగించేందుకు అటవీ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అటవీ బ్లాక్‌లను గుర్తించడానికి, వివాదాలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో అటవీ బ్లాక్‌లను చేర్చాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు, వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలనా అటవీశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఫారెస్ట్ రేంజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన
● మూడునెలలుగా వేతనాలు లేక అవస్థలు 7

ఏళ్లుగా తప్పని నిరీక్షణ

- భూ నిర్వాసితులు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎదురుచూపులు
- మొన్నటి వరకు ఎలక్షన్‌కోడ్ సాకుగా చూపిన అధికారులు
- భూనిర్వాసితుల సమస్యలు తీర్చితేనే లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు
- నిత్యం రోడ్డెక్కుతున్న డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు



గజ్వేల్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

గజ్వేల్, జూలై 2 : అటు భూనిర్వాసితులకు ఇటు లబ్ధిదారులకు ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. ఇల్లు, వాకిలి, వ్యవసాయ భూమి, ఉన్న ఊరును విడిచిపెట్టి వచ్చిన భూనిర్వాసితుల సమస్యలకు ఏళ్లుగా పరిష్కారం దక్కడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఇరువర్గాలు ఆందోళన చెందుతున్నాయి. కొందరికి ప్యాకేజీలు, పరిహారం, ఇతరత్రా వచ్చి... కొందరికి రాకపోవడంతో రానివారు దిగులు చెందుతున్నారు. మల్లన్నసాగర్ భూసేకరణ ప్రక్రియ 2016లో ప్రారంభమై 2019వరకు కొనసాగింది. ఇక ఆర్అండ్ఆర్ కాలనీకి సంబంధించిన అంశం 2017లో ప్రారంభమైనా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 2021లో మల్లన్నసాగర్ భూనిర్వాసితులను ఆయా గ్రామాల నుంచి గజ్వేల్‌కు తరలించారు. ఇళ్లను తీసుకున్న వారికి డబుల్ బెడ్‌రూంలను, ఇళ్లను తీసుకోని వారిని తాత్కాలికంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు నిర్మించిన ఇళ్లలో వసతిని కల్పించారు. వారికి ఏడాదిలోగా పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ, ప్లాట్, ఇళ్లకు సంబంధించిన నగదును ఇస్తామని చెప్పారు. మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇదే క్రమంలో గతేడాది మార్చిలో గజ్వేల్ లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించేందుకు డ్రా తీయగా వారు ఏడాదిన్నరగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో నిరుపేదలకు, మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు నిత్యం గొడవలు జరుగుతున్నాయి.



గజ్వేల్‌లో ధర్నా చేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు (ఫైల్)

భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తేనే

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తేనే డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమస్యకు చెక్ పడే అవకాశాలున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్, ముట్రాజ్‌పల్లిలో నిర్మించిన 1100 ఇళ్లకు 1100 మంది లబ్ధిదారులకు ఎంపిక చేశారు. ఈ క్రమంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పలువురు భూనిర్వాసితులు ఉంటున్నారు. మరికొంత మంది భూనిర్వాసితులు గజ్వేల్‌తో పాటు హైదరాబాద్, సిద్దిపేట, ప్రజ్ఞాపూర్ ప్రాంతాల్లో అద్దెకు ఉంటున్నారు. అయితే తమ సమస్యలు పరిష్కరిస్తేనే ఆ డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగిస్తామని నిర్వాసితులు ఇప్పటికే అల్టీమేటం జారీచేశారు. ఈ క్రమంలో అధికారులు వారి వద్ద ఉన్న నిర్వాసితులకు సంబంధించిన వివరాలతో ఎవరెవరికి ఏఏ పరిహారం, ప్యాకేజీ, ఇతరత్రా రావాలో విడతల వారీగా పరిష్కరిస్తూ ఇళ్లను ఖాళీ చేయిస్తే లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు అందజేయడానికి వీలుంటుంది.

ఇప్పటికే పలుమార్లు రోడ్డెక్కిన లబ్ధిదారులు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే తమకు అప్పగించాలని లబ్ధిదారులు పలుమార్లు భూనిర్వాసితులతో గొడవలకు దిగడంతో పాటు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను సైతం అధికారులు ఇప్పటివరకు అందజేయలేదు. ఇది కూడా లబ్ధిదారుల్లో ఆందోళనకు కారణమవుతుంది. గతంలో ఇచ్చిన ఇళ్లలో అనర్హులు ఉన్నారని, అసలైన లబ్ధిదారులకు అందజేయాలని ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తమకు దక్కిన ఇళ్లకు పట్టాలు ఇవ్వకపోవడంతో తమకు ఇస్తారో... ఇవ్వరో అన్న భయం వారిలో నెలకొన్నది. ఈ క్రమంలోనే వారు మాటిమాటికీ ఆందోళనకు దిగుతున్నారు.

ప్రభుత్వం స్పందిస్తేనే..

మల్లన్నసాగర్ భూనిర్వాసితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న క్రమంలో గత సెప్టెంబరు మొదలుకుని ఇప్పటివరకు అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను, ఎన్నికల విధులను సాకుగా చూపించిన అధికారులు ఇకపై ఏ కారణం చూపలేని పరిస్థితి. అధికారులు పూర్తిస్థాయిలో మారడంతో వారికి మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీపై పట్టులేకపోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దాదాపుగా రూ.100కోట్లను విడుదల చేస్తే సమస్యలకు పరిష్కారం లభించే అవకాశాలున్నాయి.

రీసర్వేనా... అనర్హుల ఏరివేతా?

గతేడాది జిల్లా యంత్రాంగం ఎంపిక చేసిన డబుల్‌బెడ్‌రూం లక్కీడ్రా లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలోనే సీఐటీయూతో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా లిస్టును తయారు చేసి జిల్లా, గజ్వేల్ డివిజన్ అధికారులకు అప్పగించారు. దాదాపు 120 మంది వరకు అనర్హులు ఉన్నారని, అర్హులుగా ఎంపిక చేసిన వారికి ఇళ్లు, స్థలాలు, భవనాలు, స్థిరాస్తులు ఉన్నాయని సాక్షాలతో సహా అప్పగించారు. ఈ క్రమంలోనే అనర్హులను తొలగిస్తారా లేక రీ-సర్వే చేపడుతారా?అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతానికి భూనిర్వాసితులు ఖాళీ చేసిన ఇళ్లను ఎవరికి అప్పగించకుండా అలాగే ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఠాణా ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

- కుమారులపై అక్రమ కేసు పెట్టారంటూ బలవన్మరణానికియత్నం



చికిత్స పొందుతున్న కవిత

దుబ్బాక, జులై 2: తనకు రావాల్సిన భూమిని పాలెవాళ్లు ఆక్రమించడమే కాకుండా, తమ కుమారులపై అక్రమంగా కేసు పెట్టారంటూ సిద్దిపేట జిల్లా దుబ్బాక పోలీసుస్టేషన్ ఆవరణలో మహిళ మంగళవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం రఘోత్తంపల్లికి చెందిన సింగిరెడ్డి భీంరెడ్డి, అతని నలుగురు అన్నదమ్ముల మధ్య భూవివాదం ఉంది. ఈ విషయంలో గతంలోనే సిద్దిపేట సీపీతో పాటు పలు మీడియా సంస్థలను ఆశ్రయించారు. రెండునెలలుగా సాగుతున్న భూవివాదంలో పలుమార్లు పంచాయతీ కూడా పెట్టారు. అయినా, ఇరుపక్షాలు పెద్దల తీర్పును ఒప్పుకోలేదు. సమస్య దుబ్బాక పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు భూవివాదంలో ఇరుపక్షాల మీద పోలీసులు కేసు నమోదు చేశారు. తామే బాధితులమని, తమపైనే కేసు నమోదు చేశారంటూ మంగళవారం సాయంత్రం దుబ్బాక పోలీసు స్టేషన్‌కు వచ్చిన భీంరెడ్డి భార్య సింగిరెడ్డి కవితా తనతోపాటు తెచ్చుకున్న ఎలుకల మందు గుళికలను మింగింది. పోలీసులు అప్రమత్తమై, బాధితురాలిని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలికి ఎలాంటి ప్రాణాపాయమూ లేదని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారూ.. మమ్మల్ని విడిచివెళ్లొద్దు

- బదిలీపై వెళ్తున్న టీచర్‌ను కన్నీటితో వేడుకున్న విద్యార్థులు

రాయపోల్, జూలై 2: సారూ.. మమ్మల్ని వదిలి వెళ్లవద్దు సారూ.. అంటూ విద్యార్థులు ఆ ఉపాధ్యాయుడిని వేడుకున్నారు. ఇన్నాళ్లు తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఆ మాస్టరు బదిలీపై వెళ్లవద్దంటూ అభిమానంగా గేటు ముందు అడ్డుపడి వేడుకున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డెపల్లి ఉన్నత పాఠశాలలో ఆరేళ్లుగా పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు ఎన్. శ్రీనివాస్ అక్కన్నపేట మండలం మోత్కులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. మంగళవారం పాఠశాల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీనివాస్ చుట్టూ చేరి 'సారూ మీరు వెళ్లొద్దంటూ' కంటతడి పెట్టుకున్నారు. దీంతో ఉపాధ్యాయుడు సైతం భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకునారు.. విద్యార్థులకు మంచి విషయాలను బోధించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి శ్రీనివాస్ కృషి చేశారని గ్రామస్తులు కొనియాడారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని వెళ్లొద్దని వేడుకుంటున్న విద్యార్థులు



గవర్నర్‌తో స్పీకర్, చైర్మన్ భేటీ

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. గవర్నర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన మరుసటి రోజే శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్ కలవడం చర్చనీయాంశమైంది. అయితే గవర్నర్ రాధాకృష్ణన్‌ను తాము మర్యాదపూర్వకంగానే కలిశామని శాసనసభ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రాజెక్టుల నిర్వహణకు నిధులేవి?

ఏటా రూ.600కోట్లపైనే అవసరం.. ఏడు నెలలుగా నిధుల మంజూరుకు బ్రేక్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం కొన్నాళ్లుగా నిధులు విడుదల కావడం లేదు. గత డిసెంబరులోనే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఆ తర్వాత వరుస ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. ఫలితంగా పలు ప్రాజెక్టుల పరిధిలో వానాకాలంలోగానే చేపట్టాల్సిన మరమ్మతులు సైతం నిలిచిపోయాయి. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధుల చెల్లింపులకు గ్రీన్‌చానల్ అమలు చేయాలని ప్రతిపాదనలు వచ్చినా.. గత ప్రభుత్వం అమలు చేయలేదు. ఫలితంగా గత డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.100కోట్ల మేర ఓ అండ్ ఎం పనులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయి. ఏ శాఖకు లేని విధంగా నీటి పారుదల శాఖకు కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శులు ఉన్నా.. ఈ అంశంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 40 వరకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉండగా 42,000 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఉన్నాయి. ఇవీ కాక 900 కిలోమీటర్ల మేర పైప్డ్ కెనాల్ వ్యవస్థ కూడా ఉంది. 138 పంప్‌హౌస్‌లు, 115దాకా సబ్‌స్టేషన్లు(నీటిపారుదలశాఖకు ప్రత్యేకంగా కట్టిన), 1.30లక్షల కెనాల్ నిర్మాణాలు(అక్విడెక్ట్‌లు, బ్రిడ్జిలు, సైఫన్లు) ఉన్నాయి. ప్రధాన డ్యామ్‌లు, రిజర్వాయర్ల పరిధిలోని గేట్లు, జనరేటర్లు, రోప్ వైర్లకు మరమ్మతులు, లీకేజీల నివారణ, కాలువల్లో కలుపు మొక్కల తొలగింపు, దెబ్బతిన్న కాలువల మరమ్మతులు, గేట్ల పెయింటింగ్, గ్రీజింగ్.. ఇలాంటివన్నీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కిందకే వస్తాయి. ఏటా వీటి నిర్వహణకు సుమారుగా రూ.600కోట్లు అవసరమవుతాయని అంచనాలున్నాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలోనూ ఓ అండ్‌ఎం కోసం నిధులు విడుదల చేయలేదు. దాదాపు రూ.100కోట్లకుపైగా బిల్లులు ఆగిపోవడంతో చిన్న కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు.



మొహం చాటేస్తున్న పెద్ద కాంట్రాక్టర్లు

లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) లోపమే ప్రధాన కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ తేల్చిన విషయం తెలిసిందే. నిర్వహణ పనుల ఖరీదు చిన్నదే అయినా... వాటిని విస్మరిస్తే కలిగే నష్టం వందల కోట్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టుల నిర్వహణ పనులకు టెండర్లు పిలిస్తే.. బడా కాంట్రాక్టరెవరూ స్పందించలేదు. దీంతో చిన్న కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు కాకపోవడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతోనే పనులు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.


అధికారాలున్నా నిధుల్లేవు

ప్రాజెక్టుల నిర్వహణ పనులను పెండింగ్‌లో పెట్టకూడదన్న ఉద్దేశంతోనే అధికారాలను వికేంద్రీకరిస్తూ నీటిపారుదల శాఖ గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) స్థాయిలో రూ.కోటి, చీఫ్ ఇంజనీర్(సీఈ) రూ.50లక్షలు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్(ఎస్ఈ) రూ.25లక్షలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) రూ.5లక్షల మేర పనులకు అనుమతులు ఇచ్చే అధికారాన్ని కల్పించింది. నిర్వహణ పనుల కోసం ప్రత్యేకంగా విభాగాన్ని, ఒక ఈఎన్‌సీతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి కొంత మేర నిధులను వీరి వద్ద అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. అయితే, ఇప్పుడు వీరి వద్ద ఒక్క పైసా కూడా లేదు. వీరి వద్ద నుంచి వచ్చిన బిల్లులు సైతం ఆగిపోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వమైనా ఈ విధానాన్ని సంస్కరించి, ఓఅండ్‌ఎం బిల్లులను గ్రీన్‌చానల్‌లో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏపీలో పేదలకు ఇసుక ఉచితం!

విధివిధానాల తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశం

ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాల్సిందేనని వెల్లడి



అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. 2014-19 కాలంలో ఇసుక విధానం ఎలా ఉంది.. పేదలకు ఎలాంటి మేలు జరిగింది.. 2019-24(మే) వరకు ఇసుక అమ్మకాల విధానం ఎలా ఉంది.. ఎవరు లబ్ధిపొందారు.. ప్రభుత్వానికి జరిగిన నష్టం.. పేదలు, గృహ నిర్మాణరంగానికి జరిగిన నష్టమెంతో అంచనా వేయాలని ఆదేశించారు. మంగళవారమిక్కడ సచివాలయంలో గనుల శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఇసుకపై సమీక్ష జరిపారు. జగన్ పాలనలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహనిర్మాణ రంగం కుదేలైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గృహనిర్మాణ రంగానికి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్న సమాచారం ఉందని, ధరలను భారీగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతానికి దాదాపు 40 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం ఆరాతీశారు ఇకపై ఆఫ్‌లైన్ ఇసుక అమ్మకాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఉచిత ఇసుకతోపాటు ఇతర అమ్మకాల ద్వారా సరఫరా చేసే ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానం తీసుకురావాలని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి బుధవారం సీఎంకు సమర్పించనున్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్

మర్రి దీపిక కాంగ్రెస్‌లో చేరిక

మేడ్చల్ టౌన్, జూలై 2 : మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి గట్టి షాక్ తగిలింది. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డికి సన్నిహితంగా ఉండే మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి, ఆమె భర్త మర్రి నర్సింహారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చెరువుకొమ్ము శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్‌లతో కలిసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు చెందిన వైస్‌చైర్మన్‌తో సహా 13 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా మిగిలిన ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ప్రస్తుతం చైర్‌పర్సన్‌తో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంతమంది కౌన్సిలర్లకు ఈ పరిణామం ఇబ్బందికరంగా మారింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడానికి గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు చేస్తున్న కౌన్సిలర్లకు చెక్ పెట్టడానికే చైర్‌పర్సన్ దీపిక కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి భర్త మర్రి నర్సింహారెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లతో ఉన్న పరిచయాలు పార్టీ మారేందుకు కలిసొచ్చాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

చర్ల, జూలై 2: దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ఘటనల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, మందుపాతరలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఘుమడి, కుర్రేవాయి గ్రామాల పరిధిలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో నారాయణపూర్, కొండెగావ్, కాంకేర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ల నుంచి మొత్తం 1,400 మంది జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నాలుగు జిల్లాల సరిహద్దుల నుంచి అబూజ్‌మడ్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఘుమడి, కుర్రేవాయి గ్రామాల మధ్య మావోయిస్టులు తారసపడడంతో ఇరు పక్షాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఐజీ తెలిపారు. పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కాగా, తప్పించుకున్న మావోయిస్టులు అడపాదడపా కాల్పులు జరుపుతున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం గుట్టల్లో ఉండడంతో మృతదేహాల తరలింపు ఆసల్యమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో తుపాకుల మోత మోగుతోంది. వరుస ఘటనలతో బస్తర్. వార్ జోన్‌గా మారింది. ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్‌కౌంటర్లలో 136 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట మంగళవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉన్నారు. కుంట ఏరియా కమిటీలో 20 ఏళ్లుగా వీరు పనిచేశారని ఎస్పీ తెలిపారు.

ఈడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. అక్రమ మైనింగ్ కేసులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మనీలాండరింగ్ అభియోగాలు ఉన్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాలని మహిపాల్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన మహిపాల్ రెడ్డి అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మహిపాల్ రెడ్డిని విచారించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూధన్ రెడ్డి కలిసి సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లయ్ అనే సంస్థ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మహిపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలు సహా పది చోట్ల జూన్ 20న ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఎమ్మెల్యే సోదరులు అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని ఈడీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

అసైన్డ్ భూములు తారుమారు


తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు ఇల్టెపు లక్ష్మయ్య, బేగరి కిష్టయ్య

ఆన్‌లైన్ రికార్డు తప్పులతో రైతులకు తిప్పలు

- కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోని అధికారులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న రైతులు

కొండాపూర్, జూలై 2: అధికారుల నిర్లక్ష్యంతో కోట్లు విలువ చేసే అసైండ్ (ప్రభుత్వ) భూములు తారుమారయ్యాయి. సాగుచేస్తున్న రైతుల భూములు ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లి రైతులు తిప్పలు పడుతున్నారు. 2017లో జరిగిన భూ ప్రక్షాళన ధరణి పట్టా పాస్ పుస్తకాలను 2018-19లో రైతులకు రెవెన్యూ అధికారులు అందజేశారు. కానీ ఆన్‌లైన్ రికార్డు నమోదులో తప్పులు దొర్లాయనితహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 92లో ఇల్టేపు కిష్టయ్యకు మూడెకరాలు, కుమ్మరి నర్సింహులుకు మూడెకరాల అసైన్డ్ భూమి ఉన్నది. ఖాస్రా, కబ్జా కాలం నాటి నుంచి తాత, తండ్రి వారి అధీనంలో సాగుచేస్తున్నారు. 2017 భూప్రక్షాళనలో వారికి కొత్త పాసు పుస్తకాలు అందలేదు. దాదాపు ఐదేళ్లుగా ఆఫీసులు, అధికారుల చుట్టూ తిరిగినా ఆన్‌లైన్, ధరణి పట్టా పాసు పుస్తకాలు అందలేదు. సిహెట్ కొనాపూర్ గ్రామానికి చెందిన బేగరి పర్మయ్య తండ్రి రత్నయ్యకు 40, 54, 180 సర్వే నంబర్లలో 2 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. పట్టాదారు చనిపోవడంతో.. అదే గ్రామానికి చెందిన బేగరి పర్మయ్య తండ్రి సాయన్న వారసులకు రెవెన్యూ అధికారులు పౌతి మార్పిడి చేశారు. అప్పటి నుంచి బాధితులు అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా.. ఆన్‌లైన్‌లో వారికి నమోదు కాలేదు.


మునిదేవుపల్లిలో అసైండ్ భూమిలో గోంగూర, కంది పంటసాగు

అసైన్డ్ భూమిని ఆన్‌లైన్‌లో మార్పు..

మన్‌సాన్‌పల్లిలో సర్వే నంబరు 192లో టీడీపీ ప్రభుత్వం (ఎన్టీఆర్ హయాం)లో రైతులకు భూ పంపిణీ చేసింది. అందులో మందుల ఆంజనేయులుకు రెండు ఎకరాల భూమి సర్టిఫికెట్‌ను రెవెన్యూ శాఖ ఇచ్చింది. ఆ భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పహణి రికార్డులో నమోదు చేసి అధికారులు ఆన్‌లైన్ చేశారు. మల్కాపూర్ రెవెన్యూ కుతుబ్‌షాయిపేటలో 16, 20 సర్వే నంబర్‌లో రూ.కోట్లు విలువల చేసే ప్రభుత్వ భూములు నోటరీ పద్ధతిలో క్రయవిక్రయాలు జరిగాయి. వ్యవసాయ సాగు భూమిగా.. చూపుతూ కోళ్లఫాం, పండ్ల తోటలతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నారు. ప్రభుత్వ భూమిని అమ్మినా.. కొన్నా.. చట్టరీత్యా నేరమన్న అధికారులు.. పౌతి, పట్టా మార్పిడి వలే రికార్డు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం

తెలంగాణ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో సాగుచేస్తున్న భూమిని ఆన్‌లైన్ నమోదు చేయకుండా అధికారుల తప్పిదం వల్ల ధరణి పాస్‌బుక్ అందక రైతుబంధు కోల్పోయాం. తాత, తండ్రి కాలం నుంచి సాగులో ఉండి జీవనోపాధి పొందుతున్నాం.. ఏ అధికారి దగ్గరకు వెళ్లినా క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తామంటూ ఐదేళ్ల గడిచిపోయింది. కార్యాలయాల చుట్టూ తిరిగి అప్పులపాలయ్యాం. అధికారులు స్పందించి తమ సాగు భూమిని ఆన్‌లైన్‌లో చేర్చాలి.

\- ఇల్టెపు లక్ష్మయ్య, రైతులు, మునిదేవునిపల్లి

తమ పరిధిలోని పనులను సత్వరమే పరిష్కరిస్తాం

తమ అధీనంలో అయ్యే పనులను సత్వరమే పరిష్కరిస్తున్నాం. మునిదేవునిపల్లి అసైండ్ భూమిలో రైతులకు అక్కడున్న భూమి ఎక్సెస్‌లో ఉంది. మల్కాపూర్, మాన్‌సాన్‌ల్లిలో భూముల్లో అప్పటి రికార్డు తమకు తెలియదు.అయినా ఆ భూములపై కోర్టులో కేసు నడుస్తుంది.ప్రభుత్వ భూములో చట్ట వ్యతిరేక పనులు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

\- ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్

కోహెడలో ధరణి ఉద్యోగుల మాయాజాలం

- రైతు ప్రమేయం లేకుండానే వేరొకరికి పట్టా!

కోహెడ, జూలై 2: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, తక్షణ మ్యుటేషన్ కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ధరణి వెబ్‌సైట్‌లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ధరణి ఉద్యోగుల మాయాజాలంతో రైతులకు తెలియకుండానే పట్టా మార్పులు జరుగుతున్నాయి. కోహెడ మండలంలోని చెంచల్ చెరువుపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల కనకవ్వకు 1993-94లో కోహెడ శివారులో సర్వే నంబర్ 971-10లో ఎకరం 07 (1-07) గుంటల వ్యవసాయ భూమిని ప్రభుత్వం ఇచ్చింది. ధరణిలో పాస్‌బుక్ టీ నంబర్ (టీ 10100081029) ఖాతా నంబర్ 1,734 కేటాయించారు. ఈ ధరణి పాస్‌బుక్ మారి కొత్త పాస్‌బుక్ కూడా వచ్చింది. కనకవ్వకు ఉన్న 1.07 గుంటల భూమిని ములవాత్ నాగేంద్ర నాయక్ పేరిట రెవెన్యూ అధికారులు మార్చారు. ఈ విషయమై తహసీల్దార్ సురేఖను వివరణ కోరగా.. మా వద్ద ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. రెవెన్యూ అధికారులే కుమ్మక్కై తమ భూమిని కాజేయడానికి కుట్రలు చేశారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. దీంతో మంగళవారం కుటుంబంతో సహా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ గోడను వెళ్లబోసుకున్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత రైతు కుటుంబం

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి

మిరుదొడ్డి, జూలై 2: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్ష బీరవ్వ(95) గ్రామంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లింది. కాగా చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందింది. స్థానికులు, కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


మృతిచెందిన లేగదూడ

చేగుంట, జూలై 2: చిరుతదాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన చేగుంట మండలం రాంపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్ అటవీ ప్రాంతంలోని తన వ్యవసాయ పొలాల వద్ద పాకలో పశువులను కట్టేశాడు. మంగళవారం ఉదయం వచ్చిచూసేసరికి దూడ లేకపోవడంతో పాటు పశువుల పాక చుట్టూ రక్తం, ఎముకల మాంసం ఉండడంతో అటవీ అధికారులు సమాచారం అందించాడు. తూప్రాన్ అటవీ సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ గ్రామానికి చేరుకుని పశువుల పాక చుట్టూ పాదాల గుర్తుల ఆధారంగా వెళ్లారు. సమీప అటవీ ప్రాంతంలోని కుంటకట్ట దగ్గర పొదల్లో లేగదూడ మృతదేహం కనిపించింది. లేగదూడపై దాడి, పాదాల గుర్తులు, చిరుత ఆనవాళ్లేనని తెలిపారు. అనంతరం లేగదూడ మృతదేహానికి పశువుల డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రాంతంలోని చుట్టుపక్కల రైతులు వ్యవసాయ పొలాల వద్ద పశువులను కట్టేయొద్దని, రాత్రివేళలో పొలానికి వెళ్లొదని సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సూచించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- పన్యాలలో మూడిళ్లలో చోరీ ● పోలీసులు, క్లూస్ టీం పరిశీలన

హత్నూర, జూలై 2: తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసిన దొంగల ముఠా.. పలు ఇళ్ల తాళాలు పగులగొట్టి, రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, నగలు అపహరించుకుపోయారు. ఈ సంఘటన హత్నూర మండలం పన్యాల గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గంటబోయిన వీరమణి, భర్త అంజయ్య, చుట్టాకుల గంగమ్మ, భర్త మొగులయ్య, తలారి రుక్కమ్మ, భర్త మల్లయ్య మూడు కుటుంబాలు బంధువుల ఇంటికి వెళ్లారు. దీన్ని అదునుగా భావించిన గుర్తు తెలియని దొంగలు ఏకకాలంలో మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఉదయం ఇంటికొచ్చి చూడగా.. చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గంటపోయిన వీరమ్మ ఇంట్లో తులం బంగారం నగలు, 10 తులాల వెండి నగలు, చుట్టాకుల గంగమ్మ ఇంట్లో వెండి, బంగారం నగలు అపహరించుకుపోయారు. తలారి రుక్కమ్మ ఇంట్లో బట్టలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు. మంగళవారం మూడు ఇళ్లలో సంగారెడ్డి క్లూస్‌టీం బృందం వేలిముద్రల నమూనాలను సేకరించారు. సంఘటనా స్థలాన్ని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ సుభాష్ పరిశీలించారు.

వీరభద్రస్వామి ఆలయంలో చోరీ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టేక్మాల్, జూలై 2: టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లి గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆలయంలోని హుండీని పగులగొట్టే ప్రయత్నం చేశారు. అనంతరం గుడి తలుపులు పగులగొట్టి.. అమ్మవారి మంగళసూత్రం, ముక్కుపుడక ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు దొంగతనం జరిగిందని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థల్నాన పరిశీలించారు.

రూ.35 వేల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

నర్సాపూర్, జూలై 2: నర్సాపూర్ పట్టణంలో పలుచోట్ల పోలీసులు సోదాలు చేసి రూ.35 వేల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిషేధిత గుట్కా, పాన్ మసాలాలు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పట్టణంలో పలు చోట్ల సోదాలు చేయగా రూ.35 వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్..?

పాపన్నపేట, జూలై 2: ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏడుపాయల సిబ్బంది ద్వారా తెలియవచ్చింది. గతంలో ఏడుపాయల ఈవోగా, ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 15 రోజుల క్రితం ఏడుపాయల ఈవోగా వచ్చిన వినోద్‌రెడ్డి, వేములవాడ ఈవోగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏడుపాయల ఈవోగా కృష్ణప్రసాద్‌ను నియమించగా.. నేడు బాధ్యతలు స్వీకరిస్తారని ఉద్యోగస్తులు, దేవాదాయ సిబ్బంది పేర్కొన్నారు.

పద్మశ్రీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూలై 2: గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ పురస్కారాలకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 31వ తేదీలోగా పద్మశ్రీ అవార్డ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, జూలై 2: చేనేత దినోత్సవం (ఆగస్టు 7)న పురస్కరించుకొని కొండాలక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకురాలు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వృత్తిలో నైపుణ్యం, ప్రత్యేకతల ఆధారంగా పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. రూ.25 వేల నగదు, చేనేత శాలువా, జ్ఞాపిక అందించి మెరిట్ సర్టిఫికేట్‌తో సత్కరిస్తామని తెలిపారు. 2023 డిసెంబరు నాటికి 30 ఏళ్లు పైబడి, పదేళ్లకు తగ్గకుండా అనుభవమున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10వ తేదీలోగా సంగారెడ్డి కలెక్టరేట్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

రేపు గెస్ట్ టీచర్ల భర్తీకి డెమో

సంగారెడ్డి అర్బన్, జూలై 2: సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుల భర్తీకి ఈ నెల 4న డెమో నిర్వహించనున్నట్లు ఆర్‌సీవో భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జీవశాస్త్రం, సాంఘీక, వాణిజ్యశాస్త్రం, వ్యాయామ, లైబ్రేరియన్, స్టాఫ్‌నర్సుల పోస్టులకు అర్హతలున్న వారు తమ బయోడేటా, ధ్రువపత్రాలతో ఇస్నాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆయన కోరారు.


ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నిబంధనలకు అనుగుణంగానే లేఅవుట్లు ఏర్పాటు చేయాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జోగిపేట, జూలై 1: డీటీసీపీ నిబంధనలకు అనుగుణంగానే లేఅవుట్లను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం జోగిపేటలోని పలు లే అవుట్లను పరిశీలించి, మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగానే లేఅవుట్లను నిర్మించాలని, అతిక్రమిస్తే బాగుండదని సూచించారు. అనంతరం అందోల్, జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో ఏకరూప దుస్తులను పరిశీలించి, వాటి నాణ్యతను గమనించారు. కుట్టు తీరును, బటన్ల ఏర్పాటును ఆయన దగ్గరుండి పర్యవేక్షించి సంతృప్తి చెందారు. అతి త్వరలో కుట్టుపని పూర్తిచేసి విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఆర్డీవో పాండు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- 12 కిలోల 150 గ్రాముల విత్తనాలు స్వాధీనం


నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన బేగంపేట పోలీసులు

వర్గల్, జూలై 2: రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తులను బేగంపేట పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం బొర్రగూడెం పరిధిలోని చందాపూర్‌లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు మండల వ్యవసాయాధికారులు, బేగంపేట పోలీసులు మూకుమ్మడిగా వెళ్లి ఏంజెల్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. దీంతో అతను కాస స్వామి, కరీముద్దీన్ అనే రైతులకు విత్తనాలను విక్రయించినట్లు తెలిపాడు. వారి నుంచి 12 కిలోల 150 గ్రాముల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు తప్పకుండా రసీదు పొందాలని, నకిలీ విత్తనాలని అనుమానం వస్తే వ్యవసాయాధికారులకు కానీ, పోలీసులకు కానీ సమాచారమందించాలని మండల వ్యవసాయాధికారి శేషశయణ తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన

- మూడునెలలుగా వేతనాలు లేక అవస్థలు

జగదేవ్‌పూర్, జూలై 2: గ్రామపంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప, పలుగుగడ్డ, జంగంరెడ్డిపల్లె, ధర్మారం తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు మంగళవారం భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడునెలలు గడుస్తున్నా జీతాలు రాకపోవడంతో చేసేది లేక భిక్షాటన చేపట్టినట్లు తెలిపారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. నెలలు గడుస్తున్నా వేతనాలు లేక కుటుంబం గడవని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు లేకపోవడంతో విధులను నిర్వహిస్తూనే అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలకు సంబంధించిన నిధులను విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.


జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మట్టి అక్రమ రవాణాపై రగిలిన గొడవ

- తడి బట్టలతో ఆలయంలో ప్రమాణం చేసిన కాంగ్రెస్‌లోని ఓ వర్గం

రామాయంపేట, జూలై 2: అడిగిన డబ్బులు ఇవ్వనందునే మట్టి అక్రమ రవాణా అడ్డుకున్నారని కాంగ్రెస్‌లోని ఓ వర్గం ఆరోపించగా.. అదే నిజమైతే తడి బట్టలతో అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేద్దామన్న సవాల్‌కు మరో వర్గం కట్టుబడింది. ఈ మేరకు మంగళవారం తమపై తప్పుడు విమర్శలు చేసిన వారిని నాశనం చేయాలంటూ పట్టణంలోని మహంకాళి అమ్మవారిపై ఒట్టు వేసి వేడుకున్నారు. పట్టణంలోని మల్లెచెర్వు నుంచి రెండ్రోజుల క్రితం వేలాది ట్రాక్టర్ల ద్వారా మట్టిని అమ్ముకున్నారు. రైతు పొలాల్లోకి తరలిస్తే తప్పు లేదు కానీ.. ఎలాంటి అనుమతి లేకుండా నల్ల మట్టిని అమ్ముకోవటం ఏమిటంటూ కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ రజనీకి ఫిర్యాదు చేశారు. ఆమె రంగంలోకి దిగి మట్టి తరలింపును నిలిపి వేయించారు. దీంతో కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య విభేదాలు పెచ్చుమీరాయి.


తడి బట్టలతో ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్హేర్‌లో వైభవంగా సీతారాముల కల్యాణం

కల్హేర్, జూలై 2: మండల కేంద్రమైన కల్హేర్‌లో సీతారాముల కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. రామాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా మొదట అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హారతి, అష్టోత్తర సహస్ర కలశ కుంభాభిషేకం, పున్యాహవచనం, హోమం, కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎంపీటీసీ సంగప్ప, డీసీసీబీ డీసీఎం నారాయణరెడ్డి, కల్హేర్ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, మాజీ చైర్మన్లు వీరశెట్టి, కరణం సంగమేశ్వర్‌రావ్, మాజీ సర్పంచులు లచ్చవ్వ బాలయ్య, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

అనీమియా నిర్మూలించి.. జీవితాలను చక్కదిద్దుకుందాం

- గిరిజన అభివృద్ధి జిల్లా అధికారి పిరంగి

పుల్‌కల్, జూలై 2: సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించి.. జీవితాలను చక్కదిద్దుకోవాలని సంగారెడ్డి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పిరంగి అన్నారు. చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం అనీమియా వ్యాధి నిర్మూలన పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని సూచించారు. ఇందుకు ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రత్యేక శిబిరాల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ వసతి గృహ అధికారి శోభ, పుల్కల్ పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, ఆరోగ్య సిబ్బంది మహేశ్‌బాబు, వెంకటరాములమ్మ, కిషన్, సృజనమ్మ, సేవంత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పిరంగి, హాజరైన విద్యార్థులు

స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలం

- దక్కించుకున్న ఇసుక మాఫియా

నంగునూరు, జూన్ 2: స్వాధీనం చేసుకున్న ఇసుకను పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం వేలం వేశారు. ఇటీవల ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఇసుక మాఫియా వ్యాపారులు పెద్దఎత్తున డంప్ చేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీయడంతో స్పందించిన అధికారులు, పోలీసులు డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇసుకను వేలం వేశారు. కాగా అక్రమంగా నిలువచేసిన సదరు వ్యక్తులే వేలంలో పాల్గొనడం గమనార్హం. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారంటే ఎంత లాభాలు పొందుతున్నారో అర్థమవుతుంది. వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వచేసిన 190 ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుకను వేలం ద్వారా విక్రయించారు. వేలంలో మూడు లక్షల 57 వేల 102 రూపాయలు వచ్చాయి. వేలం పాటలో ఆర్ఐ లింగం, ఏఎస్ఐ బాకీ పాల్గొన్నారు. వేలంపాటలో పాల్గొన్న వ్యక్తులు 50 శాతం డబ్బులు డిపాజిట్ చేయగా.. మిగతా డబ్బులు అనుమతులు పొందేటప్పుడు చెల్లించాలని సూచించామని అధికారులు తెలిపారు. వచ్చిన డబ్బులను త్వరలోనే సంబంధితశాఖ ఖజానాలో జమ చేస్తామన్నారు. ఇసుక వేలం వేస్తున్నారని సమాచారం తెలుసుకున్న సిద్దిపేటకు చెందిన అవసరం ఉన్న కొంతమంది వేలంపాట వద్దకు రాగా.. వారిని ఇసుక మాఫియా అడ్డుకొని పంపించినట్లు సమాచారం.


రామాలయం గుడి వద్ద ఇసుక వేలంలో పాల్గొన్న అధికారులు, హాజరైన ఇసుక వ్యాపారులు

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

● డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య



పాఠశాలలోని గుంతలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య తదితరులు

మిరుదొడ్డి,జూలై2: మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం వహించవద్దని, నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలని డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య పేర్కొన్నారు. మిరుదొడ్డిలోని ఆదర్శ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎంపీవో జహిరోద్దిన్, టీఏ సుభాష్, పంచాయతీ కార్యదర్శి వహీం ఉన్నారు.

'ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి'

గజ్వేల్, జూలై 2: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని గజ్వేల్‌-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్ పేర్కొన్నారు. వర్షాకాల సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గజ్వేల్ పట్టణంలోని ఎనిమిదో వార్డులో మంగళవారం డ్రైడేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడమిక్ సెల్ సభ్యులు దేవసాని వాసుదేవ్, నాగరాజు, దుర్గాగౌడ్‌లతో కలసి ఆయన ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వార్డులో దోమల మందును పిచికారి చేయించారు. వారితో ఫీల్డ్ వర్కర్, ఆశావర్కర్లు ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకుల నిరసన

● వినతిపత్రాల అందజేత

గజ్వేల్, జూలై 2: నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ ఎదుట నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు మెతుకు కరుణాకర్, మండల అధ్యక్షుడు సాయికిరణ్‌ల ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయ డీటీ భార్గవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని విమర్శించారు. వారితో బీజేవైఎం జిల్లా కోశాధికారి ఆర్కే యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్, బీజేపీ నాయకులు బండారి మహేష్, మన్నే శేఖర్, నాయిని సందీప్, షైన విజయ్, వెంకట్రామిరెడ్డి, కుమార్‌గౌడ్, కిష్టాగౌడ్, అరవింద్, శివ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కమిటీ సూచన మేరకు కుకునూరుపల్లి బీజేవైఎం అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, సదానందగౌడ్, నాగరాజు, స్వామి, శేఖర్, అఖిల్, పాల్గొన్నారు.



కుకునూరుపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



వర్గల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మండల నాయకులు

● **ములుగు:** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేవైఎం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆరోపించారు. మండల కేంద్రమైన ములుగు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన పాపాలకు నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బద్రి భాస్కర్, కొండు నరసింహులు, ఏలేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, మండల కోకన్వీనర్ అరుణ్‌రెడ్డి, సతీష్, అశోక్, కిషన్ మోర్చా అధ్యక్షుడు నవీన్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ మధు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు మొగుళ్ల మల్లేశం, బీజేవైఎం మిరుదొడ్డి మండల అధ్యక్షుడు సదానందరెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం నాయుకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీళ్లు, నిధులు నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసపోతున్నారని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ గోవర్దన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరుణాకర్, సురేష్, చంద్రకుమార్, సంజీవ్, నవీన్, బాబు, శ్రావన్, మహేశ్, పాల్గొన్నారు.

● **వర్గల్:** రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం రాష్ట్ర, జిల్లా శాఖ పిలుపు మేరకు వర్గల్ మండల కేంద్రంలో మండల బీజేవైఎం అధ్యక్షుడు బబ్బూరి రవీందర్ ఆధ్వర్యంలో వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు మహేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కిచ్చుగారి పాండు సుధాకర్‌రెడ్డి, బద్రీనాథ్, వెంకట్‌గౌడ్, మధుగౌడ్, మణికంఠ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం

కొండపాక, జూలై 2: ఆగిఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నాగులబండ సమీపంలో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి మంగళవారం చోటుచేసుకున్నది. దుద్దెడకు చెందిన పుట్ట మల్లేష్ సిద్దిపేట నుంచి దుద్దెడ వైపు వెళ్తున్నాడు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సమీపంలో ఆగిఉన్న లారీని బలంగా ఢీకొని కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి సమాచారం అందుకున్న 108 సిబ్బంది మహేందర్, రమేష్ సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మద్దూరు, జూలై 2: జనగామ జిల్లా నర్మెట్ట మండలం అమ్మాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో మద్దూరు మండలం వల్లంపట్లకు చెందిన భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. వల్లంపట్లకు చెందిన ముస్త్యాల రవి తన భార్య, ఇరువురు పిల్లలతో కలిసి ద్విచక్రవాహనం మీద నర్మెట్ట మండలకేంద్రంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగివస్తుండగా, అమ్మాపూర్ శివారులో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు వంటిమామిడిలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు.

మల్లన్న భక్తులపై దాడికి పాల్పడిన ఏడుగురి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ ఎల్. శ్రీను

చేర్యాల, జూలై 2: ఇటీవల కొమురవెల్లి మల్లన్న భక్తులపై దాడికి పాల్పడిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ ఎల్. శ్రీను తెలిపారు. ఈమేరకు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన జాగిరి కరుణాకర్, వెంకట్, జశ్విన్ తమ మిత్రులతో కలిసి ఈనెల29వ తేదిన మల్లన్న దర్శనం కోసం వచ్చి గదులకోసం నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో గ్రామానికి చెందిన సార్ల నవీన్, చీర్ల శ్రీకాంత్, పేర్ని శివమణి, దేశెట్టి వినయ్, దేశెట్టి నవీన్, పండుగ పవన్, రంగు రాజు కర్రలు, ఇనుప రాడ్‌లతో వారిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. విచారణ చేపట్టి నిందితులను పట్టుకున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్, ఏఎస్ఐ సాంబయ్య ఉన్నారు.

పొన్నాల వాసికి డాక్టరేట్

సిద్దిపేట అర్బన్, జూలై 2: ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో రీసెర్చ్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్ ఇన్వెస్టిగేషన్ క్యారెక్టరైజేషన్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ కుమారిన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను, సిద్దిపేట అర్బన్ మండలం, పొన్నాల గ్రామానికి చెందిన ప్రభాకర్ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన డాక్టరేట్ పొందడం పట్ల సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

చేర్యాల, జూలై2: చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన మేరిండ్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, స్ఫూర్తి, కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఫౌండేషన్ మృతుడి కుటుంబానికి చేయూత నందించాయి. మృతుడి పెద్దకూతురు రిషిత బీటెక్ చదువుతున్న క్రమంలో ఆమె కళాశాల, హాస్టల్ ఫీజు రూ.1,02,500చెల్లించేందుకు అంగీకరించాయి. ఈమేరకు మంగళవారం ఫౌండేషన్ రిప్రజంటేటివ్స్ పోలగోని విష్ణు, ధర్మాలు గ్రామానికి చేరుకుని కుటుంబసభ్యులకు సహాయం అందజేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, రాజేశ్ ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం:ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/కొండపాక, జూలై 2: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం కోమటిబండకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉబ్బని అశోక్ కొన్ని రోజుల క్రితం నీటిలో మునిగి మృతిచెందగా, అతడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉన్నందున వారి కుటుంబానికి రూ.2లక్షల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. వారితో బీఆర్ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండే మధు, జడ్పీటీసీ పంగ మల్లేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, కోమటిబండ మాజీ సర్పంచ్ తూంశేఖర్, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రావికంటి చంద్రశేఖర్, గొడుగు స్వామి, పాల రమేశ్‌గౌడ్, అహ్మద్ ఉన్నారు.

దుద్దెడకు చెందిన పార్టీ కార్యకర్త జక్కుల మమత కుటుంబానికి 2 లక్షల రూపాయల చెక్కును మంగళవారం వంటేరు ప్రతాప్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, తెలంగాణ జాగృతి నాయకులు అనంతుల ప్రశాంత్, రైతుబంధు మాజీ కోఆర్డినేటర్ రాగల దుర్గయ్య, మాజీ ఎంపీపీ బైరెడ్డి రాధా కిషన్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్, సీనియర్ నాయకులు మల్లమారి రవీందర్, దోమల ఎల్లం, పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, దొమ్మాట లక్ష్మారెడ్డి, దొమ్మట మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన క్షీరాసాగర్ ఎంపీటీసీ

ములుగు, జూలై 2: రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మండలంలోని క్షీరాసాగర్‌కు చెందిన కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి ఆయన సతీమణి ఎంపీటీసీ కొన్యాల మమతతో పాటు ఇద్దరు కుమారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆలయానికి విరాళాలు

కోహెడ, జూలై 2 : మండలంలోని బస్వాపూర్ శ్రీ పంచముఖలింగ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు మంగళవారం విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన ఆదిమూల సత్యనారాయణ, ఆదిమూల శ్రీహరి రూ 50,116, ఉపాధ్యాయుడు సమ్మెట శ్రీనివాస్ రూ.15,116, సిద్దిపేటకు చెందిన బేజుగాం శంకరయ్య రూ 11,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. విరాళాలు ఇచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కమిటీసభ్యులు యాదగిరి, రమేష్ లు కోరారు.

'సాగు భూములకే రైతుబంధు ఇవ్వాలి'



మద్దూరు: మాట్లాడుతున్న ఆడిట్ అధికారి

మద్దూరు/చేర్యాల, జూలై 2: సాగు భూముల రైతులకే రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని మెజారిటీ రైతులు తమ అభిప్రాయాన్ని వెళ్లబుచ్చారు. మండలంలోని రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యలయంలో మంగళవారం చైర్మన్ తిరుపతిరెడ్డి అధ్యక్షతన రైతుబంధు పథకంపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆడిట్ అధికారి ఎ. నాగేశ్వర్‌రావు, ఏవో బి. రామకృష్ణ హాజరయ్యారు. రైతుబంధు పథకం అసలే వద్దని పలువురు చెప్పగా, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కొందరు, 5 ఎకరాల లోపు రైతులకు వర్తింపజేయాలని మరికొందరితో పాటు 10 ఎకరాల వరకు వర్తింపజేయాలని ఇంకొందరు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, అఖిల్, కల్పన, అనూష, రాధిక, సీఈవో బోయిని శ్రీధర్, ఉపేందర్, విజేందర్ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రూ.2లక్షలమేర పంటరుణమాఫీ అమలుచేయనున్న నేపథ్యంలో మంగళవారం చేర్యాల పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో అత్యవసర మహాజన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీఏ తక్కోలు రాధిక, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, చేర్యాల ఏవో అఫ్రోజ్, కొమురవెల్లి ఏవో నరేశ్, వైస్ చైర్మన్ నర్సయ్య డైరెక్టర్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తాన్ని సద్వినియోగించుకోవాలి

● గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్



రైతు నేస్తంలో ఏడీఏ బాబునాయక్, ఏవో ప్రియదర్శిని

గజ్వేల్, జూలై 2: రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ కోరారు. గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో ప్రతి మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమగ్ర వ్యవసాయం, పంటల్లో కలుపు నివారణ, అంతర పంటల సాగు విధానం, పురుగు మందుల యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం పద్ధతులను శాస్త్రవేత్తలు, అధికారులు వివరించారు. సేంద్రియ వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. రైతుభరోసా కార్యక్రమంపై అధికారులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వారితో వ్యవసాయశాఖ ఏవోలు ప్రియదర్శిని, గుండు నాగరాజు, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

● బీజేపీ నాయకుల డిమాండ్

వర్గల్, జులూ 2: పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ హిందూ సమాజం పట్ల చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హిందువులకు, భారతీయ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేస్తూ, మంగళవారం వర్గల్ కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాహులగాంధీ చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, బద్రినాథ్, నరేందర్‌రెడ్డి, బబ్బూరి రవీందర్, మహేశ్ యాదవ్, వెంకట్‌గౌడ్, మణికంఠ ఉన్నారు.

6న విడిభాగాల వేలం

చిన్నకోడూరు, జూలై 2: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసుస్టేషన్‌లలో దెబ్బతిన్న పలు రకాల విడిభాగాలను, పోలీస్ వాహనాలకు వాడిన బ్యాటరీలు, విడిభాగాలను ఈనెల 6న ఉదయం 11.30 గంటల నుంచి మండలంలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో వేలం వేయనున్నట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు అదే రోజు ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించే ప్రదేశానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డును వెంట తీసుకుని రావాలని సూచించారు. ఎమైనా సందేహాలు ఉంటే రిజర్వు ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, (8712667416), హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ(9949384565)ను సంప్రదించాలన్నారు.

కొండపోచమ్మ హుండీ లెక్కింపు

జగదేవ్‌పూర్, జూలై 2: మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. అమ్మవారికి 86 రోజులకు గాను రూ. 8,04,353 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రవికుమార్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. అమ్మవారికి కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత రమేశ్, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్దన్ ఉన్నారు.

96 మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లు

● బదిలీల్లోనూ మద్దూరు ప్రాథమిక పాఠశాలకు దక్కని కేటాయింపులు



ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మద్దూరు, జూలై 2: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు లేకపోవడంతో మెరుగైన విద్యాబోధన అందని పరిస్థితి నెలకొన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆంగ్ల మీడియంలో 96 మంది విద్యార్థులకు గాను ఒకరు ప్రధానోపాధ్యాయుడు కాగా మరొకరు ఎల్.ఎఫ్.ఎల్.హెచ్.ఎం ఉన్నారు. ఉర్దూ మీడియంలో 17 మంది విద్యార్థులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన నేపథ్యంలో ఈ పాఠశాలకు కేటాయింపులు చేపట్టలేదు. మూడేళ్లక్రితం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించగా, అప్పటి నుంచి ఇద్దరే ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. పాఠశాల దుస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా, ఈ పాఠశాలలోనే చేర్పించాలని చేసిన విన్నపానికి విద్యార్థుల సంఖ్య క్రమేపి 96కు చేరుకుంది. కానీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు 0-10 విద్యార్థులకు గాను ఒక టీచర్, 11-40 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లను, 41-60 మంది విద్యార్థులకు ముగ్గురు చొప్పున, అంతకు మించి విద్యార్థులున్న పాఠశాలలకు ఆ స్కూల్‌కు మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

సీఐని సస్పెండ్ చేయాలి

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి, జూలై2: దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనును వేధింపులకు గురిచేసి ఆత్మహత్యయత్నానికి కారణమైన అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని జాతీయ ఎస్సీ కమిషన్, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు బాబునాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరునెలలుగా దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనును సీఐ జితేందర్‌రెడ్డి మానసికంగా వేధిస్తుండడంతో మహబూబాబాద్ జిల్లాలో పురుగుల మందును తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని ఆరోపించారు. దళిత ఎస్ఐని వేధింపులకు గురిచేసిన సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కేందుకే కొత్త చట్టాలు

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్, జూలై 2: ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకువచ్చిందని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్(ఐఏఈ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష అధినియం(బీఎస్ఏ) దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని, ఈ చట్టాలు ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కేలా ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలతో చర్చలు లేకుండా ప్రజాస్వామ్యవాదులకు సమాచారం లేకుండా కొత్త నేర చట్టాలను ఎందుకు అమలు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఆయన వెంట నాయకులు షైసయ్య, రాజేశ్ ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుస్నాబాద్, జూలై 2: హుస్నాబాద్ పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం మహిళాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐపీసీ నుంచి బీఎన్ఎస్‌గా మారిన న్యాయ వ్యవస్థలోని కొత్త చట్టాలు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఎస్‌వో బేతి భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ పి. అన్నపూర్ణ, మహిళా సాధికారత సభ్యులు లావణ్య, పద్మ, వాసవి, న్యాయవాదులు కిరణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్‌ప్లేట్ల పంపిణీ

హుస్నాబాద్‌రూరల్, జూలై 2: మండలంలోని పొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యశ్రీ, స్వరూపరాణి ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రభాకర్, వేణుమాధవ్, భిక్షపతి, శివకుమర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా రేష్మా

చేర్యాల, జూలై 2: కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామానికి చెందిన రేష్మ మహిళా కాంగ్రెస్ విభాగం మండలాధ్యక్షురాలిగా నియామకమైంది. ఈమేరకు మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి చేతులమీదుగా నియామకపత్రం అందుకుంది.

హాఫ్ మారథాన్‌ను విజయవంతం చేయాలి: మిరుదొడ్డి ఎస్ఐ



హాఫ్‌మారథాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ పరుశురాములు, స్టేషన్ సిబ్బంది

మిరుదొడ్డి,జూలై2: ఈనెల 28న సిద్దిపేటలో నిర్వహించే హాఫ్‌మారథాన్‌ను విజయవంతం చేయాలని మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు కోరారు. మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం హాఫ్‌మారథాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాఫ్‌మారథాన్‌లో పాల్గొనే వారు ఈనెల 10 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు కాసరాజు, మాజీ ఎంపీటీసీ భైరయ్య, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

'బీజేపీ నాయకులపై దాడి సరికాదు'



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ములుగు, జూలై 2: మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నందుకు బీజేపీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు ములుగులో డిప్యూటీ తహసీల్దార్‌కు మంగళవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అరుణ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ భూముల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా బీజేపీ నాయకులు అడ్డుకున్నారని, బీజేపీ నాయకులపై వారు దాడి చేయడం సరైనదికాదన్నారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన నాయకులు

గజ్వేల్, జూలై 2: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంటేరి నరేందర్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, సర్దార్‌ఖాన్, లక్ష్మారెడ్డి, యాదగిరి, శివరాంరెడ్డి, నక్కరాములు, సుగుణాకర్‌రెడ్డిలు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవుల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సూచించిన వారికి పదవులు వస్తాయని ఆయన హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి'

దూళిమిట్ట, జూలై 2: మైనార్టీలో పడిపోతున్న తమ కులస్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. మండలకేంద్రంలో నూతనంగా ఎన్నికైన సిద్దిపేట జిల్లా నాయీబ్రాహ్మణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మంగళవారం దూళిమిట్ట, మద్దూర్ మండల నాయీబ్రాహ్మణులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నాయీబ్రాహ్మణ నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సిద్దిపేట ఏసీపీ మధు



మాట్లాడుతున్న ఏసీపీ మధు

కొండపాక/సిద్దిపేట రూరల్, జూలై 2: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు విద్యార్థులకు సూచించారు. మండలంలోని మర్పడగ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు భైరయ్య, అధ్యాపకులు, సిద్దిపేట షీటీమ్ సిబ్బంది కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత వీణకుమారి, కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. సోమవారం రాత్రి సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో పోలీసు కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని యువకులకు సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి, కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

● అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ మాలోతు లక్ష్మి

అక్కన్నపేట, జూలై 2: అందరి సహకారంతో ఈ ఐదేళ్లలో మండల అభివృద్ధికి కృషి చేశామని అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీటీసీలు ఐదేళ్ల పాటు పదవీబాధ్యతలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యక్రమాలతో పాటు గ్రామాల అభివృద్ధికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఇందులో జడ్పీటీసీ భూక్య మంగ, ఎంపీడీవో బానోతు జయరాం, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

విద్యాధరి క్షేత్రంలో కృత్తికా నక్షత్ర విశేష పూజలు

వర్గల్/హుస్నాబాద్‌రూరల్, జులై 2: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీవల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కృత్తిక నక్షత్ర పూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం సతీసమేతులైన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకాలు, అర్చనలు, లక్షపుష్పార్చణ చేశారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మిషన్ భగీరథ నల్లా పన్నులను రద్దు చేయాలి

● మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డిపో కాలనీ వాసులు

హుస్నాబాద్, జూలై 2: మిషన్ భగీరథ నల్లా పన్నులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బస్‌డిపో కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. మిషన్ భగీరథ నీటిని ఉచితంగా సరఫరా చేయాలని నినాదాలు చేశారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఇంటింటికీ మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చిందని, ఆరు సంవత్సరాల నుంచి నీటి పన్నులను వసూలు చేయలేదని, ప్రస్తుతం నల్లా కనెక్షన్లు ఇచ్చిన నాటి నుంచి పాత బకాయిలు చెల్లించాలని మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెల రూ. 100 నీటి పన్ను విధిస్తున్నారని, ఐదు సంవత్సరాలకు రూ. 6వేల వరకు పన్ను పడుతుందని, ఇది పేద ప్రజలకు అధిక భారం అవుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మలికార్జున్‌రెడ్డి, కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, రేణుక, కోమల, కనుకవ్వ, లక్ష్మి, సునిత, లక్ష్మన్, కనుకయ్య తదితరులున్నారు.

అక్కన్నపేట ఎస్ఐ బదిలీ

అక్కన్నపేట, జూలై 2: అక్కన్నపేట ఎస్ఐగా పనిచేస్తున్న తాండ్ర వివేక్‌ను కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఆరోగ్యం అక్కన్నపేట ఎస్ఐగా ఒకటి రెండు రోజుల్లో రానున్నట్లు సమాచారం.